

## బార్ అసోసియేషన్‌గా అధ్యక్షుడిగా లింగంపల్లి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

కరీంనగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో లింగంపల్లి నాగరాజు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చందా రమేష్, ప్రధాన కార్యదర్శిగా కందుల అరుణ్ కుమార్, జాయింట్ సెక్రటరీగా సిరి కొండ శ్రీధర్ రావు, కోశాధికారిగా ముద్దసాని సంపత్ కుమార్, లైబ్రరీ సెక్రటరీగా తుమ్మ ప్రభాకర్, స్పోర్ట్స్ సెక్రటరీగా బలరాం గుగులోతు ఎన్నికయ్యారు. సీనియర్ కార్యవర్గ సభ్యులుగా గుంటి మధు, సందూరి భూమిరెడ్డి, వెన్న ఆనంద్, జూనియర్ కార్యవర్గ సభ్యులుగా కొలిపాక ప్రియాంక, ఏనుగు సంతోష్ కుమార్, కోల ప్రభాకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. "నూతన బార్ అసోసియేషన్ బృందం న్యాయవృత్తిలో విలువలు కాపాడుతూ సభ్యుల హక్కులను పరిరక్షిస్తుందని ఆశిస్తున్నా" అంటూ దావు సుధాకర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



# చరిత్ర తెలుసుకోకపోతే చరిత్ర సృష్టించలేం

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్






**శెనార్తి మీడియా, మంథని (కరీంనగర్)**

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం త్యాగం చేసిన మహనీయుల చరిత్రను తెలుసుకోవడం ద్వారా మాత్రమే చరిత్రను సృష్టించగలమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. సామాజిక సాంఘీక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మంథని పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. మహనీయుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక డ్రెస్ కోడ్‌లో 'మహనీయుల దీక్ష' చేపట్టినట్లు తెలిపారు. ఈ దీక్షను ఏప్రిల్ 14న జరిగే అంబేద్కర్ జయంతి వరకు కొనసాగిస్తామని వెల్లడించారు. గత సంవత్సరం 15 మంది పాల్గొన్న ఈ దీక్షకు ఈసారి రెట్టింపు స్పందన లభించిందని, వచ్చే ఏడాది దీక్షాపరుల సంఖ్య మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మహాత్మా పూలే జీవితాన్ని గుర్తు చేసిన మధూకర్ అక్షర జ్ఞానం లేని బహుజన వర్గాలకు విద్య అందించేందుకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. తన కుటుంబాన్ని త్యాగం చేసి సమాజానికి అంకితం చేసిన మహనీయుడని, సావిత్రి బాయి పూలేను తొలి మహిళా గురువుగా తీర్చిదిద్దిన వ్యక్తిగా ఆయన గొప్పతనాన్ని వివరించారు. అంబేద్కర్, చాకలి ఐలమ్మ, కోమురం బీం, జగ్జీవన్‌రాం వంటి మహనీయుల చరిత్రను తెలుసుకోకపోతే బానిసత్వంలోనే మన బతుకులు కొనసాగుతాయని హెచ్చరించారు. మంథని నియోజకవర్గంలో గుడిసెల్లో జీవిస్తున్న పేదల పరిస్థితులకు స్థానిక పాలకులే బాధ్యతవహించాలని విమర్శించారు.ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తోందని, మహనీయుల జయంతి ఉత్సవాలను అణిచివేయాలని చూస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుతంగా తమ హక్కుల కోసం మాట్లాడినా కేసులు పెడుతున్న తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీ మంథనిలో రాజ్యాంగ ఉల్లంఘనలపై స్పందించాలని కోరారు. అంబేద్కర్ అందించిన ఓటు హక్కు విలువను ప్రజలకు తెలియజేయడమే తన లక్ష్యమని, తుదిశ్వాస వరకు తన పోరాటం కొనసాగుతుందన్నారు. దీక్షాపరులు గ్రామాలకి వెళ్లి మహనీయుల ఆలోచనలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి ఇంటికి వెళ్లి చరిత్రను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**తెలుగుదేశం పార్టీ ఆద్వర్యంలో...**

తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో దివంగత మహాత్మా జ్యోతిబాపూలే గారి 198వ జయంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మొదలు మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి అడ్ హాక్ కమిటీ పార్లమెంట్ సభ్యులు మోరే ప్రభాకర్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మోరే ప్రభాకర్ మాట్లాడుతూ దివంగత జ్యోతిబాపూలే 1827 వ సంవత్సరంలో మహారాష్ట్రలో జన్మించి ఒక సామాన్యుడిగా మొదలైన వారి జీవితం అంచలంచలుగా ఎదిగి అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి, సామాజిక సంస్కర్త, ఆలోచనపరుడు మరియు బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు జ్యోతిబాపూలే. వారి ఆశయాల సాధనకు మనమందరం కట్టుబడి ఉండి ముందుకు తీసుకెళ్లాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి పోక్సో కోర్టు సంచలన తీర్పు

- అత్యాచార నిందితుడికి 25 ఏళ్ల జైలు

**హైదరాబాద్,ఏప్రిల్11 :**

నాంపల్లి లోని పోక్సో కోర్టు శుక్రవారం సంచలన తీర్పుని వెలువరించింది. 2023లో రాజ్‌భవన్ మక్త ప్రాంతంలో మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడు శ్రీనివాస్‌కు కోర్టు 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఈ కేసు తీర్పు ప్రకటనతో బాధిత కుటుంబానికి న్యాయం లభించిందన్న భావన నెలకొంది. 2023లో శ్రీనివాస్ అనే వ్యక్తి మైనర్ బాలికను సెల్‌ఫోన్ ఇస్తానని మాయ మాటలతో మభ్యపెట్టి తన ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక ప్రాణాలతో బయటపడిన తర్వాత, తల్లిదండ్రులు వెంటనే నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు విచారణ సమయంలో కోర్టుకు అందిన ఆధారాలు, బాలిక ధైర్యంగా ఇచ్చిన వాంగ్మూలం, వైద్య నివేదికలు అన్ని నిందితుడిపై అభియోగాలను నిరూపించాయి. పోక్సో చట్టం కింద ఈ కేసును విచారించిన నాంపల్లి ప్రత్యేక కోర్టు, నేరం నిరూపితమైందని తేల్చి, శ్రీనివాస్‌కు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అంతేకాకుండా, నిందితుడిపై జరిమానా కూడా విధించింది. ఈ తీర్పుతో మైనర్ బాలికలపై హింసను తట్టు-కోలేని స్థితిలో ఉన్న కుటుంబాలకు ఒక ధైర్యం లభించినట్లయిందని అనేక మంది న్యాయవాదులు అభిప్రాయపడ్డారు.

## మహిళా సంఘాల డబ్బులు దుర్వినియోగం

**శెనార్తి మీడియా, దిలావర్పూర్:** కంజర్ గ్రామంలో మహిళా సంఘాల డబ్బుల దుర్వినియోగానికి సంబంధించి మహిళా సంఘ సభ్యుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన అధికారులు భారీ అవినీతిని వెలికితీశారు.గ్రామంలో డ్వాక్రా గ్రూపులో విఓఏగా పనిచేస్తున్న నిమ్మ ముత్యం మహిళా సంఘాల నిధులను దుర్వినియోగం చేశాడని సభ్యురాలు ఫిర్యాదు చేయడంతో, ఏపీడి ఆదేశాల మేరకు ఆడిట్ జరిపారు. మూడు రోజుల పాటు సీబీఓ ఆడిటర్లు నిర్వహించిన లావాదేవీల పరిశీలనలో నిమ్మ ముత్యం రూ.5,27,266ను దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. నివేదికను డీఆర్‌డీఏ అధికారులకు సమర్పించగా, నిమ్మ ముత్యాన్ని విధుల నుండి తొలగిస్తూ, దుర్వినియోగం చేసిన మొత్తాన్ని రికవరీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా సభ్యుల అరెస్టు

- జాతీయ రహదారులపై దారి దోపిడీ
- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర




**శెనార్తి మీడియా, కామారెడ్డి:**

జాతీయ రహదారులపై దారి దోపిడీకి పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను కామారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం, కామారెడ్డి జిల్లా జాతీయ రహదారి-44పై ఇటీవల వరుసగా దారి దోపిడీ సంఘటనలు చోటు చేసుకున్నాయి. దేవునిపల్లి, సదాశివ నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. నిందితులు రాత్రివేళల్లో హైవేపై ఆగి ఉన్న వాహనాలపై దాడికి పాల్పడి, అద్దాలు పగులగొట్టి, వాహనదారులను బెదిరించి డబ్బులు, విలువైన వస్తువులు, మొబైల్ ఫోన్లు దోచుకునేవారు.ఈ కేసుల దర్యాప్తులో భాగంగా ఎస్పీ ఆదేశాలతో నలుగురు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేయగా, వారి కృషితో మహారాష్ట్రకు చెందిన ఏడుగురు ముఠా సభ్యులు అరెస్టయ్యారు. వారు ఖాళీ ప్రదేశాల్లో డేరాలు వేసుకుని, పగలంతా చిరు వ్యాపారాల ముసుగులో ఉండి, రాత్రిళ్ళు దోపిడీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.అరెస్టైన వారిలో కూలీ కిసాన్ పవర్, జాకీ గుజ్జు బోస్లే, పవర్ హరీష్, అనురాగ్ రత్నప్ప బోస్లే, అంచనా, చూడి చూడి, చిరంజీవి ఉన్నారు. వారి వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్ బ్యాగ్, నాలుగు కర్రలు, నాలుగు కత్తులు, రెండు రాళ్లు, రెండు బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఇంకా పరారీలో ఉన్న మిగతా ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు కొనసాగుతోందని ఎస్పీ చెప్పారు. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా నిందితులు నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు.ఈ కేసును ఛేదించిన ఎఎస్పీ కామారెడ్డి, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ఉస్మాన్, కామారెడ్డి రూరల్ సీఐ ఎస్.రామన్, సదాశివ నగర్ సీఐ సంతోష్, దేవునిపల్లి ఎస్సై జి.రాజు, సదాశివనగర్ ఎస్సై రంజిత్, ఐటీ కోర్ శ్రీనివాస్, హెచ్‌సీ, పీఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## నేడు నగరంలో హనుమాన్ జయంతి శోభాయాత్ర

- గౌలిగూడ నుంచి తాడ్‌బన్ ఆంజనేయ మందిర్ వరకు ర్యాలీ
- భారీగా పోలీస్ బందోబస్తు..ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్,ఏప్రిల్11 :**

హనుమాన్ జయంతి సందర్భంగా హైదరాబాద్ నగరంలో శనివారం ఘనంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నారు. హనుమత్ జయంతి శనివారం రావడంతో మరితం కోలాహలం నెలకొననుంది. ఈ శోభాయాత్ర గౌలిగూడలోని శ్రీ రామమందిరం వద్ద ఉదయం 11 గంటలకు ప్రారంభమై, నగరంలోని పలు కీలక ప్రాంతాల గుండా తాడ్‌బండ్‌లోని శ్రీ హనుమాన్ మందిరం వద్ద ముగుస్తుంది. శోభాయాత్ర మార్గం పుత్లిబౌలి క్రాస్ రోడ్స్, ఆంధ్రా బ్యాంక్ క్రాస్ రోడ్స్, కోఠి, సుల్తాన్ బజార్ క్రాస్ రోడ్స్, రామ్‌కోఠి క్రాస్ రోడ్స్, కాచిగూడ క్రాస్ రోడ్స్, నారాయణగూడ వైఎంసీఏ, చిక్కడపల్లి క్రాస్ రోడ్స్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్ నగర్, గాంధీ నగర్ బ్యాక్ సైడ్ వైశ్రాయ్ హోటల్, ప్రాగా టూల్స్, కవాడిగూడ, సీజీవో టవర్స్, బన్సీలాల్‌పేట రోడ్, బైబిల్ హౌస్, సిటీ లైట్ హోటల్, బాటా షోరూమ్, ఉజ్జయిని మహంకాళి టెంపుల్, ఓల్డ్ రామ్‌గోపాల్‌పేట రోడ్, పారడైజ్ క్రాస్ రోడ్స్, సీటీవో జంక్షన్, లీ రాయల్ ప్యాలెస్, బ్రూక్ బాండ్, ఇంపీరియల్ గార్డెన్, మస్తాన్ కేఫ్ మీదుగా సాగుతూ తాడ్‌బండ్‌లోని హనుమాన్ టెంపుల్‌కు చేరుకుంటుంది. ఈ శోభాయాత్ర సజావుగా సాగేందుకు పోలీసు శాఖ శనివారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. ఈ రహదారులపై ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా లక్డీ కాపూల్ నుంచి సికింద్రాబాద్ స్టేషన్, ఉప్పల్ వైపు వెళ్లే వాహనదారులు వీవీ స్టాచ్యూ, సోమాజిగూడ, గ్రీన్ ల్యాండ్స్, బేగంపేట్ a`లఫై ఓవర్, ప్రకాశ్ నగర్ a`లఫై ఓవర్, పారడైజ్ a`లఫై ఓవర్ మీదుగా సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకోవాలని సలహా ఇచ్చారు. ఈ శోభాయాత్రలో భక్తుల భద్రత , ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు శాఖ విస్తృత ఏర్పాట్లు- చేసింది, కాబట్టి నగరవాసులు ఈ ఆంక్షలకు సహకరించి, హనుమాన్ జయంతి వేడుకలు సాంతం సజావుగా జరిగేలా తోడ్పడాలని అధికారులు కోరుతున్నారు.

## ఏసీబీ వలలో ట్రెజరరీ అధికారి

**శెనార్తి మీడియా, జగిత్యాల :**



ట్రెజరరీ కార్యాలయంలో లంచం తీసుకుంటూ సీనియర్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ ఘటన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం కలకలం రేపింది. ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి వెల్లడించిన వివరాల ప్రకారం, ట్రెజరరీ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రఘు అనే ఉద్యోగి ఓ వ్యక్తి నుంచి రూ.7000 లంచం తీసు కుంటూ ఏసీబీ అధికారుల వలలో చిక్కాడు.పెట్టుబడి రకమైన లావాదేవీల కోసం ట్రెజరరీ శాఖ వద్ద మంజూరైన మొత్తాన్ని విడుదల చేయడానికి ఉద్యోగి లంచం కోరాడని, దీనిపై బాధితుడు ఏసీబీని సంప్రదించాడని తెలిపారు. వెంటనే చర్యకు దిగిన అధికారులు ట్రాప్ వేసి రఘును పట్టుకున్నారు.ఇప్పటికే నిందితుడిపై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు అధికారులు తెలిపారు.



## చిన్నారులకు కంటి వైద్య పరీక్షలు

**శెనార్తి మీడియా , గన్నేరువరం:**

అంగన్వాడీ కేంద్రాల్లో ఆర్ బి ఎస్ కే కరీంనగర్ టీం ఆధ్వర్యంలో ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు కంటి వైద్య పరీక్షలు, మానసిక రుగ్మతలు, ఎదుగుదల లోపాలను గుర్తించి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలకు ఏమైనా లోపాలు ఉంటే మందులు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లా ఇమ్యూనేజేషన్ అధికారి డాక్టర్ సాజిదా సందర్శించి పిల్లలు, వారి తల్లి తండ్రులతో పౌష్టికాహారం, పరిశుభ్రత, ప్రాముఖ్యత ఆరోగ్య సేవల గురించి వివరించారు. తల్లి బిడ్డల ఆరోగ్యంపై చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు హచియిద్దీన్, వసంత్, అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చాణక్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పూలేకు నివాళి

**శెనార్తి మీడియా, జమ్మికుంట:**

చాణిక్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో జయంతి ఉత్సవాలకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కళాశాల కరస్పాండెంట్ దబ్బేట విజయ రవీందర్ మాట్లా డుతూ, మహాత్మా జ్యోతిబాపూలే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని, అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేసిన సంఘ సంస్కర్తగా నిలిచారని తెలిపారు. మహిళా విద్యాభివృద్ధికి పునాది వేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ప్రభాకర్, శ్రీనివాస్, విజయేందర్ రెడ్డి, చిరంజీవి, శివ, ప్రిన్సిపల్ వంశీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు సాయికృష్ణ, సతీష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

